



లాల్‌బాగ్ రోడ్డు కిమ్స్ ఆసుపత్రి సమీపంలో నడిరోడ్డుపై గొయ్యి

## నేడు హావేరి, గదగ్ జిల్లాల్లో
# పీఎం ధన్‌ధాన్య యోజన

● వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ



బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హావేరి, గదగ్ జిల్లాలలో ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజనను శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా వర్చ్యువల్‌లో లాంచనంగా ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా వంద జిల్లాలను ఈ పథకానికి ఎంపిక చేశారు. అందులో హావేరి, గదగ్ జిల్లాలు ఉన్నాయి. పంచాయతీ, బ్లాక్‌స్థాయిలో ఆహారధాన్యాల గోదాముల నిర్మాణంతోపాటు సమగ్ర వ్యవసాయ అభివృద్ధికి అనుగుణంగా పథకం పనిచేయనుంది. వ్యవసాయ దిగుబడుల పెంపు, రైతుల ఆదాయం రెట్టింపు, రైతులకు ఆర్థిక భద్రత వంటి కార్యక్రమాలను పథకం ద్వారా అమలు చేయనున్నారు. ప్రధానమంత్రి ప్రారంభించే కార్యక్రమాన్ని వర్చువల్ రూపంలో రైతులు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు.

## రాజ్యోత్సవ పురస్కారాల ఎంపికకు
# 47మందితో కమిటీ

బెంగళూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మరో ఇరవై రోజుల్లో జరిగే రాజ్యోత్సవం రోజును విభిన్నమైన రంగాల సాధకులను ఎంపిక చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సలహా కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి అధ్యక్షత వహిస్తారు. సాధారణంగా రాజ్యోత్సవ పురస్కారాల ఎంపిక కమిటీకి కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడిని భాగస్వామ్యులు చేస్తుండేవారు. కానీ ఇటీవల పరిషత్ అధ్యక్షుడు మహేశ్‌జోషిపై తీవ్రమైన ఆరోపణలు, కోర్టు కేసులు, విచారణ సాగుతున్న తరుణంలో పురస్కారాల ఎంపిక కమిటీనుంచి కూడా పక్కనపెట్టారు. వివిధశాఖల నుంచి సాధకులు 47మందిని కమిటీలో ఉంచారు. మరో 17మంది వివిధ ప్రాధికారల అధ్యక్షులను నియమించారు.

# విశ్వంలోనే వేగంగా..



● అభివృద్ధిలో పరుగులు పెడుతున్న బెంగళూరు
● 1.40 కోట్లకు చేరుకున్న నగర జనాభా
● పారదర్శక పాలన కోసమే గ్రేటర్ అడుగులు
● తొలి ప్రాధికార సమావేశంలో సీఎం సిద్దరామయ్య



గ్రేటర్ బెంగళూరు ప్రాధికార సమావేశంలో సీఎం, డీసీఎం



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బెంగళూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం విశ్వంలోనే వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలనే గ్రేటర్ బెంగళూరు అథారిటీ ఏర్పాటు చేశామని సీఎం సిద్దరామయ్య అన్నారు. కెంపేగౌడ ఆడిటోరియంలో గ్రేటర్ బెంగళూరు ప్రాధికార తొలిసభ శుక్రవారం జరిగింది. డీసీఎం, బెంగళూరు అభివృద్ధిశాఖల మంత్రి డీకే శివకుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బెంగళూరు విశ్వంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమన్నారు. ప్రపంచంలోని పలుదేశాల ప్రజలు ఇక్కడ పెట్టుబడులకు ముందుకు వస్తున్నారన్నారు. ఇక్కడే జీవించాలని భావిస్తున్నారన్నారు. నగరజనాభా 1.40 కోట్లకు పెరిగిందన్నారు. కేవలం ఒక పాలికెతో సమగ్రపాలనా వ్యవహారాలు సాధ్యం కావడం లేదని చర్చ జరిగిందన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎక్కువ కార్పొరేషన్లు ఏర్పాటు చేసే విషయమై ఓ కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం గ్రేటర్ బెంగళూరు అథారిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల మే 15న గ్రేటర్ బెంగళూరు అమలులోకి వచ్చిందన్నారు. ఐదు నగర పాలికెల ద్వారా పాలనా వ్యవహారాలు సాగించదలిచామన్నారు. గ్రేటర్ ద్వారా నగరానికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఇతరత్రా అన్ని సౌలభ్యాలు సమకూరుస్తామన్నారు. బీడీఏ, జలమండలి, బెస్కాం, బీఎంఆర్‌సీఎల్ వంటి సంస్థలు గ్రేటర్‌తో కలసి పనిచేస్తాయన్నారు. ఐదు కార్పొరేషన్ల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ లబ్ధికోసం గ్రేటర్‌ను తీసుకురాలేదన్నారు. ప్రజాసౌలభ్యమే మాకు ముఖ్యమన్నారు. ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకునే ముందుకు అడుగు వేస్తామన్నారు. రాజకీయ ఆలోచనలతో వ్యతిరేకించేవారిని ఏం చేయలేమన్నారు. జీబీఏ చీఫ్ కమిషనర్ మహేశ్వర్‌రావు పర్యవేక్షించారు. మంత్రులు జమీర్ అహ్మద్‌ఖాన్, రామలింగారెడ్డి, కేజే జార్జ్ ఎమ్మెల్యేలు హారిస్, కృష్ణప్పతోపాటు పలువురు పాల్గొన్నారు.

# హోల్ సిటీ..!

● నగర ప్రధాన రహదారులపై గోతులు
● తెరుచుకున్న మ్యాన్‌హోళ్లు ● వాహనదారుల బెంబేలు

బెంగళూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో రద్దీగా ఉందంటే నగరం అభివృద్ధికి నిదర్శనమని స్వయంగా ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంకఖర్గే ప్రకటించారు. రోడ్లపై వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం రద్దీగాను, రాష్ట్ర పరిపాలనా కేంద్రం విధానసౌధను వదిలితే వెళ్లాల్సిన నృపతుంగ రోడ్డులో మ్యాన్‌హోల్స్ ఇనుపకడ్డీలు తొలగిపోయాయి. స్థానికులు రోజూ మొక్కలు లేదా కొమ్మలు అడ్డుగా వేస్తున్నారు. కనీసం వేగంగా వచ్చే సమయంలో వాహనదారులు గమనిస్తారని భావిస్తున్నారు. ఇక నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం ముందే మ్యాన్‌హోల్ తెరుచుకుంది. అడ్డంగా ఓ బ్యారికేడ్ వేసి పోలీసులు చేతులు దులుపుకున్నారు. కనీసం మరమ్మత్తులు చేయాలని గ్రేటర్ బెంగళూరు అధికారులకు సూచించలేదు. ఇక లాల్‌బాగ్ నుంచి కిమ్స్ మెడికల్ కళాశాల ఆసుపత్రికి వచ్చే మెయిన్‌రోడ్డులోనూ రంధ్రం ఏర్పడింది. రోజూ ప్రజలు ఇబ్బంది పడుతున్నా గ్రేటర్ బెంగళూరు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.



నృపతుంగరోడ్డులో మ్యాన్‌హోల్





కమిషనర్ కార్యాలయం వద్ద..

# భక్తులతో కిటకిటలాడిన హాసన్

● తొలిరోజు హాసనాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు ● ప్రత్యేక పూజల్లో మంత్రి కృష్ణబైరేగౌడ



అమ్మవారి దర్శనానికి వెళ్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ



హాసనాంబ అమ్మవారు

బెంగళూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏడాది తర్వాత తెచుకున్న హాసనాంబదేవి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గురువారం ఆలయాన్ని ఆధ్యాత్మిక సంప్రదాయాలకు అనుగుణంగా తెరిచిన విషయం తెలిసిందే. అయితే పూజా సంప్రదాయాలతో భక్తులకు దర్శనం లేదు. శుక్రవారం తొలిరోజు దర్శనం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామునుంచే క్యూలైన్లలో భక్తులు బారులుతీరారు. హాసన్ నగరమంతటా జనసందడిగా మారింది. హాసనాంబ జాతరకు జిల్లా ప్రజలతోపాటు మైసూరు, తదితర జిల్లాలనుంచి పెద్దఎత్తున తరలివస్తున్నారు. ప్రదర్శన శాలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కృష్ణబైరేగౌడ లాంచనంగా ప్రారంభించారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ ఓ పోటీని ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. అరసికెరె ఎమ్మెల్యే శివలింగేగౌడ, ఎమ్మెల్సీ సూరజ్‌రేవణ్ణలు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రిపొద్దుపోయేదాకా దర్శనం కొనసాగింది. తొలిరోజున బ్రహ్మాండగురూజీ అలియాస్ నరేంద్రబాబుశర్మ దర్శించుకున్నారు. ఇదే సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సంచలన విషయాలు వెల్లడించారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి ఇదే తొలిసారి అన్నారు. రాజకీయాలకోసం పోట్లాటలు పెరుగుతున్నాయన్నారు. సంక్రాంతిలోగా పెను పరిణామాలు చోటు చేసుకుంటాయన్నారు. హాసనాంబ ఆలయ దర్శనం కూడా వచ్చే ఏడాది ఉండకపోవచ్చునని వ్యాఖ్యానించారు. కర్ణాటక మూడు భాగాలు కానుందని, దేశంలోనూ విభజన అంశం తారస్థాయికి చేరనుందన్నారు. దేశానికి ప్రధానిమోదీ రక్షణ కవచంలాంటివారన్నారు. భవిష్యత్తులో ఓ సన్యాసి దేశ ప్రధాని కానున్నారని జోస్యం పలికారు.



క్యూలైన్లలో భక్తులు

## నీటికుంటలో పడి అక్కాతమ్ముడు మృతి

సిరుగుప్ప, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నీటికుంటలో పడి ఇద్దరు చిన్నారులు దుర్మరణం చెందారు. బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలుకాలోని మైలాపురం గ్రామం వద్ద గురువారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. టెక్కలకోట ఎస్ఐ సద్దామ్ హుస్సేన్ తెలిపిన వివరాల మేరకు బలకుంది గ్రామ పంచాయతీ పరిధిలో మైలాపురం గ్రామం వద్ద బలకుంది గ్రామానికి చెందిన ముదుకప్ప కుమారుడు శివరాజు (9), కుమార్తె మహాంకాళి (12)లు నీటి కుంట వద్ద నీరు తాగేందుకు వెళ్లారు. ఇద్దరూ కాలుజారి కుంటలో పడిపోయారు. ఊపిరాడక వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. టెక్కలకోట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.



రోదిస్తున్న తల్లిదండ్రులు



బాలి మృతదేహం

## మాజీ ప్రధానిని పరామర్శించిన స్వామీజీ



దేవెగౌడను పరామర్శిస్తున్న నిర్మలానంద స్వామీజీ

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవేగౌడను ఆదిచుంచనగిరి పీఠాధిపతి డాక్టర్ నిర్మలానందనాథస్వామీజీ శుక్రవారం పరామర్శించారు. స్వల్ప అస్వస్థతకు గురై నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో ఐదురోజులుగా దేవెగౌడ చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. దేవెగౌడ త్వరగా కోలుకోవాలని స్వామీజీ ఆకాంక్షించారు. కాగా ఇప్పటికే మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ తదితరులు మాజీ ప్రధానిని పరామర్శించారు.



# బిహార్ ఎన్నికలే అడ్డు..!

● పోరు ముగియడమే తరువాయి ● రాష్ట్రంలో పెను మార్పులు...!
● కేబినెట్‌లో 15-20మందికి చెక్ ● 13న మంత్రులకు సీఎం విందు



బెంగళూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మార్పులు లేవంటున్నా నవంబర్‌లో పెను మార్పులకు సంకేతాలు కనిపిస్తున్నాయి. బిహార్‌లో శాసనసభ ఎన్నికలు ముగియగానే కాంగ్రెస్ అధిష్ఠానం కర్ణాటకపై దృష్టి సారించే అంశంపై సూత్రప్రాయంగా తెలిపినట్లు సమాచారం. దీంతో రెండు రోజులుగా రాష్ట్ర కాంగ్రెస్ నేతల్లో అలజడి మొదలైంది. నవంబరు నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తి అవుతుంది. 30 నెలల పరిణామం ప్రభుత్వంపై ఉంటుందా..? లేదా అనేది సందిగ్ధం అనిపిస్తోంది. కాంగ్రెస్ నేతల్లో ఎవరూ నాయకత్వ మార్పు విషయం ప్రస్తావించినా వెంటనే పార్టీ అధిష్ఠానం అప్రమత్తం అవుతోంది. అటువంటి వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరిస్తూనే నోటీసులు జారీ చేస్తోంది. ఇలా సాగుతుండగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాత్రం ఐదేళ్లు తన పాలనే ఉంటుందని అందులో మార్పు లేదని పదే పదే వ్యాఖ్యానిస్తున్నారు. ఇటువంటి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో వర్తించదు. అధిష్ఠానం సూచించిందే ఫైనల్‌గా ఎవరైనా పాటించాల్సి ఉంటుంది. కానీ సిద్దరామయ్య వ్యాఖ్యలను బట్టి ద్వంద్వ అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పరోక్షంగా సిద్దరామయ్య అధిష్ఠానాన్ని హెచ్చరిస్తున్నారా..? లేదా మార్పు ప్రస్తావన వస్తే పెను సంచలనాలు జరుగుతాయా.. అని ముందస్తు సమాచారం ఇస్తున్నారా... అనేది ఊహకు అందని విషయంగా ఉంది. గందరగోళం ఇలా సాగుతుండగానే వారం రోజుల క్రిందట బెంగళూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాతో డీసీఎం డీకే శివకుమార్ సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అధిష్ఠానం నాన్చుడు వ్యవహారం సరికాదని, అసలు నాయకత్వ మార్పు అంశం ఉందా.. లేదా... అని స్పష్టం చేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఎంతకాలం ఇలాంటి వ్యాఖ్యలు భరించాలని డీసీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

### నవంబరులో మార్పులు..

నవంబరులో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందా..? లేదా..? అనేది స్పష్టం లేకున్నా మంత్రివర్గ ప్రక్షాళన తప్పదని సంకేతాలు హల్‌చల్ చేస్తున్నాయి. కనీసం 15-20 మంది మంత్రులను తొలగించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరో రెండున్నరేళ్లు ఎన్నికలు ఉన్నందున చివరి ఏడాది లేదా కొన్ని నెలల ముందు మంత్రులుగా అవకాశం ఇచ్చినా వారు శాఖలపై పట్టు సాధించలేరని ముందుగానే అవకాశం ఇవ్వదలిచినట్లు తెలుస్తోంది. సీనియర్ మంత్రులను పార్టీ సేవలకు వినియోగించుకుని యువతతోపాటు అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని నిర్ణయించారు. దీనికితోడు కులాలకు గుర్తింపు ఉండాలని భావిస్తున్నారు. అయితే పార్టీలో సీనియర్ మంత్రులకు ఒకేసారి పక్కన పెడితే ఎటువంటి పరిణామాలు ఉంటాయో అనేది చర్చనీయాంశంగా ఉంది. పరమేశ్వర్ రాష్ట్రస్థాయిలో కీలక పదవిలో కొనసాగారు. సుదీర్ఘకాలంగా కేపీసీసీ అధ్యక్షుడిగాను, డీసీఎంగాను, ప్రస్తుతం హోం మంత్రిగా ఉన్నారు. ఆయన గడిచిన దశాబ్దన్నర కాలంగా ముఖ్యమంత్రి రేసులో ఉన్నారు. ప్రస్తుతం ఆయనను కేబినెట్‌ను తొలగిస్తే అందుకు తగిన హోదా కల్పించడం అసాధ్యం. పైగా ఎస్సీ సామాజికవర్గంలో ఆయన కీలకనేతగా ఉన్నారు. మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి రాగానే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మంత్రులు మహదేవప్ప, సతీశ్‌జార్కిహొళి, పరమేశ్వర్ గురువారం రహస్య సమావేశం జరిపారు. ఈ ఏడాది ప్రారంభంలోనూ వీరు ఇటువంటి సమావేశాలు కొనసాగించారు. వీరంతా సిద్దరామయ్యకు ఆప్తులనేది తెలిసిన విషయమే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు విమర్శించాల్సిన అవసరం లేదని, సొంతపార్టీలోనే మంత్రులు, ఎమ్మెల్యేలు చెరో విమర్శించే పరిస్థితి వచ్చిందని, అధిష్ఠానం జోక్యం చేసుకునే అవసరం ఉందని పలువురు పార్టీ ప్రముఖులు అభిప్రాయ పడుతున్నారు.


### సీఎం విందుపైనే ఉత్కంఠ

ప్రస్తుతం ఎటువంటి ప్రత్యేకత లేకున్నా సీఎం సిద్దరామయ్య కేబినెట్ సహచరులకు విందుకు ఆహ్వానించారు. ఈనెల 13న సోమవారం కేబినెట్ మంత్రులందరికీ విందుకు రావాలని సందేశం పంపారు. విందులోనే మరిన్ని రాజకీయ చర్చలు ఉంటాయని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తొలగించాల్సిన మంత్రులకు సీఎం ముందుగానే సూచించే అవకాశం ఉంది. అయితే బిహార్ ఎన్నికలు నవంబరు రెండో వారం తర్వాత జరుగుతాయి. ఫలితాలు 22న వెలువడతాయి. ఆ తర్వాతనే రాష్ట్రంలో మార్పులకు కారణం కానుందనిపిస్తోంది. ఇంకా నెలరోజులకుపైగా సమయం ఉంది. ఈలోగానే ముఖ్యమంత్రి తొలగించే మంత్రులకు దిశానిర్దేశం చేస్తారా..? అనేది సందిగ్ధంగానే ఉంది. ఇప్పటికే విస్తరణ జరిగితే మంత్రి పదవులు కోల్పోతామని ఒక నిర్ణయానికి వచ్చేశారు. వీరిలో శరణబసప్ప దర్శనాపుర, రెహమాన్‌ఖాన్, ఎంసీ సుధాకర్, కేహెచ్ మునియప్పతోపాటు పలువురు ఉన్నారు. తాజాగా మునియప్ప కొత్తవారికి అవకాశం ఇచ్చేందుకు మార్పులు ఉంటాయన్నారు. ఇదే విషయమై డీసీఎం డీకే శివకుమార్ విందులో అన్ని చర్చలు ఉంటాయని, అవి రాజకీయం కూడా కావచ్చునని అభిప్రాయపడ్డారు. దీంతో నవంబరులో రాష్ట్ర రాజకీయాల్లో క్రాంతి తప్పదని సంకేతాలు వెలువడుతున్నాయి.

### సీనియర్లకు ఉద్వాసన తప్పదా..?

ప్రక్షాళనలో సీనియర్లను తొలగిస్తే కొత్తగా కేబినెట్‌లో చేరేవారిలో ప్రధానంగా బీకే హరిప్రసాద్, సలీం అహ్మద్, నాగేంద్ర, బసవరాజ రాయరెడ్డి, అప్పాజీ నాడగౌడ, లక్ష్మణసవది, రూపా శశిధర్, జీహెచ్ శ్రీనివాస్, ఎం కృష్ణప్ప, టీబీ జయచంద్ర, రిజ్వాన్ అర్షద్, యూటీ ఖాదర్, రఘుమూర్తి, శివలింగేగౌడ, హెచ్‌సీ బాలకృష్ణ, పీఎం నరేంద్రస్వామితోపాటు ఆనేకల్ శివణ్ణల పేర్లు వినిపిస్తున్నాయి. నాగేంద్ర, బీకే హరిప్రసాద్, టీబీ జయచంద్ర, శివలింగేగౌడ, బాలకృష్ణలకు ఇప్పటికే సీఎం సిద్దరామయ్య కేబినెట్‌లో చేర్చుకునే భరోసా ఇచ్చారు. దీంతో ఆశావహుల్లో ఆందోళన మొదలయ్యింది.

బీమా సొమ్ముకోసం అల్లుడిని కడతేర్చిన మామ 7



స్వర్ణోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఖండ్రే, ఎంపీ తుకారాం తదితరులు

పర్యావరణాన్ని కాపాడుకోవాలి
● దెబ్బతీస్తే మానవాళికి నాశనం తప్పదు ● రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి 'స్వర్ణోత్సవం'లో మంత్రి ఈశ్వర ఖండ్రే 9

## దిగుబడి మిన్న.. రాబడి సున్నా

● ధరలు లేక రైతుల విలవిల
● జోరుగా పత్తి, మిరప, మొక్కజొన్న కోతలు

బళ్లారి సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ ఏడు రైతులకు విచిత్ర పరిస్థితి నెలకొంది. జిల్లాలో పలు ప్రాంతాల్లో కోతలు మొదలయ్యాయి. పంటలు బాగానే ఉన్నా ధరలు మాత్రం రైతులకు నిరాశే మిగిలిస్తున్నాయి. తాలూకాల్లోని మోకా, సిరుగుప్ప, తెక్కలకోట తదితర ప్రాంతాల్లో పత్తి పచ్చిమిరపకాయలు, మొక్కజొన్న కోతలు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ కార్మికులకు డిమాండ్ పెరిగింది. సిరుగుప్పతాలూకాలో సుమారు 1,010హెక్టార్లలో మిరప , 1.390హెక్టార్లలో మొక్కజొన్నను , 2.016 హెక్టార్లలో పత్తిని సాగు చేశారు. వర్షం కారణంగా పత్తి నల్లగా మారుతుందనే ఆందోళనతో రైతులు పత్తిని కోసే పనిలో బిజీగా ఉన్నారు. అయితే వారం క్రితం క్వింటాల్ పత్తి రూ.7,300 నుంచి 1,800 కు పడిపోయింది. మిరప క్వింటాల్ 15వేల లోపే ఉంది, ఇక మొక్కజొన్నకు కూడా సరైన ధర లేదు. దీంతో గిట్టుబాటు ధరలు లేక అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి ఉన్నా రాబడి లేదని వాపోతున్నారు.



మోకా తాలూకాలో మిరపను కోస్తున్న కూలీలు

# వీఆర్వోలు ఏరీ ?

## ఐదు రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు

● పనులు సాగక ప్రజలు, రైతులకు ఇబ్బందులు


రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం

రాప్తాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల కొరతతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఐదు మేజర్ రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జ్ వీఆర్వోలే దిక్కవడంతో తమ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేజర్ రెవెన్యూ గ్రామాలైన గాండ్లపర్తి, బండమీదపల్లి, యర్రగుంట, రాప్తాడు, గంగలకుంటకు గత ఆరు నెలలుగా రెగ్యులర్ వీఆర్వోలు లేరు. ఇన్‌చార్జ్ వీఆర్వోలే వీటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ రెవెన్యూ గ్రామాల్లో అనేక భూ సమస్యలు ఉన్నాయి. వీఆర్వోల కొరత వలన కొన్ని రకాల పనులు ముందుకు కదలడం లేదు.

### ఆలస్యమవుతున్న పనులు

రెగ్యులర్, ఇన్‌చార్జ్ రెవెన్యూ గ్రామాల విధులతో పని ఒత్తిడి పెరిగిందని, ఎక్కడా పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నట్లు వీఆర్వోలు వాపోతున్నారు. రెవెన్యూ శాఖలో వీఆర్వోల పాత్ర కీలకం. వారి సంతకం లేనిదే ఏ ఫైలు కదలదు. వీఆర్వోలు కొరత వలన కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, భూ సమస్యలు, ఓటర్ వెరిఫికేషన్, ఈ క్రాప్, ఆదార్ వెరిఫికేషన్, రేషన్ కార్డులు, రికార్డులు రాయడం, సర్వే, భూ సమస్యలు, ఇతర అనేక పనులు సకాలంలో పూర్తికావడం లేదు. చిన్న చిన్న సమస్యలకు కూడా ప్రజలు, రైతులు పదే పదే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలతో వందలాది మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. పంట రుణాల రెన్యువల్ సమయంలో వన్‌బీ పత్రాలపై వీఆర్వో సంతకం తప్పనిసరిగా ఉండాలి. రైతులు గోకులం షెడ్లు, మామిడి మొక్కల పెంపకం, ఇతర అనేక పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా వీఆర్వో సంతకం తప్పనిసరి. ఇంతటి కీలకమైన బాధ్యతలు ఉన్న వీఆర్వోలు ఇన్‌చార్జ్‌లుగా ఉండటంతో ఆయా గ్రామాల్లో పనులు సకాలంలో జరగక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ వీఆర్వోలను నియమించాలని కోరుతున్నారు.

### చుక్కల తొలగింపు కోసం తిరుగుతున్నా..

మాకు బండమీదపల్లి పొలం సర్వే నెంబర్ 391లో ఉన్న దాదాపు 16 ఎకరాల భూమి చుక్కల భూమిగా నమోదైంది. చుక్కల తొలగింపు కోసం మూడు నెలల కిందట తహసీల్దార్ కార్యాలయానికి రికార్డు సమర్పించా. రెగ్యులర్ వీఆర్వో లేకపోవడం, ఇన్‌చార్జ్ వీఆర్వోలు మారుతుండటంతో ఫైలు ముందుకు కదలడం లేదు. ఆ పని కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పదే పదే తిరుగుతున్నా. రెగ్యులర్ వీఆర్వోను నియమించాలి.

-రామాంజనేయులు, రైతు, బండమీదపల్లి

### ఉన్నతాధికారులకు తెలియజేశాం



వీఆర్వోల కొరత వాస్తవమే. ఐదు రెవెన్యూలకు వీఆర్వోలు లేరు. ఇన్‌చార్జ్‌లే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక వీఆర్వో సెలవులో ఉన్నారు. ఇంకొక వీఆర్వో డెప్యుటేషన్‌పై ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. ఉన్న కొంత మంది వీఆర్వోలతోనే ప్రజల పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

-విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

# పారిశ్రామిక పండగొచ్చింది..!

పుట్టపర్తి/హిందూపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాకు దసరా, దీపావళితోపాటు పారిశ్రామిక పండగొచ్చింది. పెట్టుబడుల వరద వస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో రేమండ్ రెండు అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయనుంది. అనంతపురం జిల్లాలో రెండు చోట్ల సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటుకానున్నాయి. అంతేకాదు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ కూడా అందుబాటులోకి రానుంది. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రేమండ్ గ్రూప్ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చింది. అందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రేమండ్ గ్రూప్ అనుబంధ సంస్థ జేకే మైని ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్‌కు ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ కోసం సోమందేపల్లి మండలం గుడిపల్లి పారిశ్రామిక పార్కులో 30 ఎకరాలను కేటాయించారు. ఎకరా రూ.45.95 లక్షలతో అప్పగించారు. రూ.430 కోట్ల పెట్టుబడితో ఈ పరిశ్రమ ఏర్పాటు కానుంది.

### పరిశ్రమలు రావడం సంతోషంగా ఉంది



ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు రేమండ్ కంపెనీ ముందుకు రావడం చాలా సంతోషం. గతంలో పరిశ్రమల ఏర్పాటుకోసం భూసేకరణ చేసి ఏళ్లు గడిచినా ఒక్క పరిశ్రమ రాలేదు. టేకులోడు ప్రాంతాన్ని పారిశ్రామిక వాడగా ఏర్పాటు చేస్తే చిలమత్తూరు మండలంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతాయి.

-బయపరెడ్డి, ఆరుమాకులపల్లి, చిలమత్తూరు మండలం

### వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు



టేకులోడు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే చదువుకున్న పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే రోడ్ల పరంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చిందింది. ఇలాంటి చోట పరిశ్రమలు ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

-ఆదినారాయణరెడ్డి, టేకులోడు, చిలమత్తూరు మండలం

### భూములు కోల్పోయినా.. ఉపాధి దొరుకుతుంది



పరిశ్రమల కోసం వ్యవసాయ భూములను ప్రభుత్వానికి ఇచ్చాం. వెంటనే ఇక్కడ రేమండ్ కంపెనీ పరిశ్రమ ఏర్పాటు చ ఏస్తోందని తెలుస్తోంది. దీంతో భూములు కోల్పోయామన్న బాధ లేదు. వెంటనే మాకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.

-విజయకుమార్, టేకులోడు

### మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

రెమండ్ గ్రూప్ అనుబంధ సంస్థల ఏర్పాటుకు వీలుగా ఆయా పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. పరిశ్రమల ఏర్పాటుకు భూములను తక్షణమే సిద్ధం చేస్తాం.

-నాగకుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

## ఉరవకొండకు సౌర వెలుగులు

అనంతపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాకు సౌర వెలుగులు రానున్నాయి. ఉరవకొండ నియోజకవర్గంలో రెండు సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటుకానున్నాయి. రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. బెళుగుప్ప మండలం ఎర్రగుడి, ఆవులెన్న, శీర్పి, దుద్దేకుంట, అంకంపల్లి, తగ్గుపర్తి గ్రామాల పరిధిలో 400 మెగావాట్ల ఏ/సి, 500 మెగావాట్ల డీసీ సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ అభ్యర్థన మేరకు ఆయా ప్రాంతాల్లో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుంచి 25 సంవత్సరాలకు రూ.120 కోట్ల గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఫండ్ ఉత్పత్తి అవుతుంది. మొదటి 12 సంవత్సరాలకు రూ.1.50 లక్షలు/మెగావాట్ల చొప్పున, మిగిలిన 13 సంవత్సరాలకు గానూ ఏడాదికి రూ.50 వేల చొప్పున స్థానిక ప్రాంత అభివృద్ధి చార్జీలు వసూలు చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 1,380 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 మేరకు వజ్రకరూరు మండలం కమలపాడు, కొనకొండ్ల, గూళ్లపాళ్యం గ్రామాల్లో 600 మెగావాట్లతోపాటు 400 మెగావాట్ల ఏ/సి 580 మెగావాట్ల డీసీ సోలార్ పవర్ ప్రాజెక్ట్ కేటాయింపు కోసం ఊర్జా వన్ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థన మేరకు ఆయా ప్రాంతాల్లో సోలార్ పరిశ్రమలు నెలకొల్పేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

### అమలుకానున్న మంత్రి లోకేశ్ హామీ

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా మంత్రిమండలిలో నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు అనంత జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ నెలకొల్పేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎక్కడ ఏర్పాటు చేస్తారు, భూముల ఏర్పాటు తదితర అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## జేజేఎంతో తాగునీటి సమస్యకు చెక్

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) ద్వారా రూ.3,800 కోట్లతో జిల్లాలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం ఆయన ఈఈ శ్రీనివాసులుతో కలిసి రాయదుర్గం డీఈ రామారావు, ఉరవకొండ డీఈ అంజుమాన్ సత్రీన్‌లతో నీటి పథకాలపై సమీక్షించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వనరుల ద్వారా ప్రతి గ్రామానికి నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. పీఏబీఆర్ నుంచి ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, రాప్తాడు, శింగనమల నియోజకవర్గంలోని కొన్ని మండలాలకు, గండికోట ప్రాజెక్టు నుంచి తాడిపత్రి నియోజకవర్గంతో పాటు శింగనమల నియోజకవర్గంలోని మండలాలకు, మిడ్‌పెన్నార్ డ్యాం నుంచి గుత్తి నియోజకవర్గంతో పాటు శింగనమల నియోజకవర్గానికి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


సిబ్బందితో సమీక్షిస్తున్న ఎస్ఈ సురేష్

# లైవ్ బకాయిలు !

## బీఎస్ఎన్ఎల్‌కు రూ.40 లక్షల బిల్లుల పెండింగ్

● పేరుకు పోయిన ప్రభుత్వ కార్యక్రమాల లైవ్ టెలీకాస్టింగ్ బకాయిలు

● బిల్లుల కోసం కలెక్టర్ల చుట్టూ బీఎస్ఎన్ఎల్ అధికారులు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సంస్థను మొండి బకాయిలు వేధిస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన లైవ్ టెలికాస్టింగ్ బిల్లులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.40 లక్షల వరకూ బకాయిలు ఉన్నట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. ఏ కలెక్టర్‌ను అడిగినా ప్రభుత్వం నుంచి ఫండింగ్ రావాలి అంత వరకూ తామేమీ చేయలేమని చెబుతుండటంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

### పెండింగ్ బిల్లులిలా...

వైసీపీ పాలనలో 2023లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి వచ్చారు. ఆయన పర్యటన లైవ్ కవరేజీ కోసం బీఎస్ఎన్ఎల్‌ను సంప్రదించారు. సీఎం ప్రోగ్రామ్ కావడంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు సైతం లైవ్ టెలికాస్టింగ్‌కు అనుమతులిచ్చారు. ఇందుకు రూ.2.20 లక్షలు ఖర్చు అయ్యింది. మరోమారు వైసీపీ హయాంలోనే అనంత జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమం లైవ్ కవరేజీ ఖర్చు రూ.12 లక్షల వరకూ వచ్చినట్లు సమాచారం. అనంతరం అధికారులు సంబంధిత జిల్లా కలెక్టర్ వద్దకు బిల్లుల కోసం వెళ్తే ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. వచ్చిన వెంటనే ఇస్తామని చెప్పారు. తర్వాత కొద్ది రోజులకు రాష్ట్రంలో అధికారం మారింది. అయినా బిల్లులు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొలువుదీరాకా శ్రీసత్యసాయి జిల్లాలోని కొత్తచెరువులో సీఎం చంద్రబాబునాయుడు పర్యటించారు. ఆ కార్యక్రమం కవరేజీ ఖర్చు రూ.3 లక్షలు అయ్యింది. అనంతరం అనంతపురంలో జరిగిన మరో కార్యక్రమానికి సంబంధించి రూ.12 లక్షలు, మరోమారు అనంత జిల్లాలోని ఓ నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించిన కార్యక్రమానికి సంబంధించి రూ.3 లక్షలు, అనంత అర్బన్‌లో తాజాగా నిర్వహించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమానికి సంబంధించి రూ.8 లక్షలు బిల్లులు బీఎస్ఎన్ఎల్ సంస్థకు అందాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కలెక్టరేట్‌లోని కొందరు అధికారులు లైవ్‌టెలీకాస్టింగ్‌కు సంబంధించిన బిల్లులు కలెక్టర్లకు సకాలంలో అందించకపోవడంతోనే చెల్లింపులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

### పెండింగ్ వాస్తవమే



రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలకు సంబంధించిన లైవ్ టెలికాస్టింగ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ఇప్పటికే పలుమార్లు రెండు జిల్లాల కలెక్టరేట్ వర్గాలకు బిల్లులు చెల్లించాలని చెప్పాం. అయినా ఇప్పటి వరకూ క్లియర్ కాలేదు. ఆ బిల్లులు క్లియర్ అయితే బీఎస్ఎన్ఎల్‌ను ఆర్థికపరమైన అంశాలతో అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది.

-ముజీబ్ పాషా, పీజీఎం, బీఎస్ఎన్ఎల్

# రెజ్లింగ్ జట్ల ఎంపిక



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ ఉమ్మడి జిల్లా జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్డీటీ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్-14, 17, 19 రెజ్లింగ్ ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

**అండర్-14 బాలురలో...** సాయి, జస్వంత్, వెంకట మనోజ్, కుషాల్, సంజీవ్, యశ్వంత్, ప్రభాస్, ధనుంజయ, రుషివర్ధన్, విశాల్ ఎంపిక య్యారు.

**బాలికల విభాగంలో...** రోజా, మన్విత, లావణ్య, యశశ్విని, చందన, స్వరూప, చాందిని, శ్లోక, నందిత, కావ్యశ్రీ ఎంపికయ్యారు.

**అండర్-17 బాలుర విభాగంలో..** రామచరణ్ తేజ, రామ్‌చరణ్, నందీష్, గణేష్,శాంతులు ఎంపికయ్యారు.

**బాలికల విభాగంలో...** అనూషా, యాసిన్, విష్ణుప్రియ, లాస్యరెడ్డి, యశస్విని, స్వరూప, శాలిని, మందారలు ఎంపికయ్యారు.

**అండర్-19 బాలుర విభాగంలో...** శివసాయి, తరుణ్‌కుమార్ రెడ్డి, శరత్, రాజేష్‌ను ఎంపిక చేశారు.

**బాలికల విభాగంలో...** మోక్షిత, శృతి, గౌతమి, కె శైలజ, స్పందన, బి శైలజ, హర్షిత ఎంపికయ్యారు. వీరు ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని శ్రీనివాసులు తెలిపారు.

# ప్రకృతి సేద్యాన్ని పరిశీలించిన పరదేశీ

### పంటల సాగును తెలుసుకున్న ఇంగ్లాండ్ దేశీయుడు

గార్లదిన్నె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ఇంగ్లాండ్ దేశానికి చెందిన ట్రావెలర్, జర్నలిస్టు, ప్రకృతి ప్రేమికుడు క్రిస్టోఫర్ పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ప్రోగ్రామ్ మేనేజర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన చీనీ, వేరుశనగ, ఆముదం తదితర పంటలను ఆయన పరిశీలించారు. చీనీ పంట సాగులో రైతులు మానస, కిశోర్ వినియోగిస్తున్న సేంద్రియ కర్షనం, వానపాములు, నేల సంతానోత్పత్తి గురించి తెలుసుకున్నారు. వేరుశనగ పంటను పరిశీలించి జీవ వైవిధ్య పంటల వలన కలుగు లాభాలపై ఆరా తీశారు. ఆముదం పంట సాగు గురించి రైతు హేమలతను అడిగి తెలుసుకున్నారు. దుంపజాతి కూరగాయలు, ఆకుకూరలు, పూల ద్వారా రైతు వరలక్ష్మి ఆర్జించిన లాభాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం, జీవనోపాధులు ఏవిధంగా అభివృద్ధి చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఘన, ద్రవ జీవామృతాల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మి, ప్రకృతి వ్యవసాయం ఎన్ఎఫ్ఐ నందిని, ఎర్రిస్వామి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులతో ఆరాతీస్తున్న క్రిస్టోఫర్

# ఇక బడిబాట..!

● ముగిసిన కొత్త టీచర్ల నియామక ప్రక్రియ

● నేడు ఉత్తర్వులు..

### సోమవారం నుంచి విధులకు..


బీకేఎస్ శిక్షణ కేంద్రంలో చివరిరోజు కొత్త టీచర్లు

అనంతపురం విద్య, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త టీచర్లు సోమవారం నుంచి బడికి వెళ్లనున్నారు. ఎంపిక ప్రక్రియ, శిక్షణ పూర్తయ్యేందుకు సుమారు నెలన్నర సమయం పట్టింది. స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్, ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా స్థానాలను కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 748 మంది టీచర్ ఉద్యోగాలు సాధించారు. ఎస్జీటీలో తెలుగు 146 మంది, ఉర్దూ 14 మంది, కన్నడ ఐదుగురు, స్కూల్ అసిస్టెంట్లలో తెలుగు 101 మంది, హిందీ 26 మంది, ఇంగ్లిష్ 25 మంది, ఉర్దూ ఐదుగురు, బయాలజికల్ సైన్స్ 70 మంది, ఫిజికల్ సైన్స్ 64 మంది, గణితం 41 మంది, పీడీలు 142 మంది, సోషల్ స్టడీస్ 108మంది, సోషల్ స్టడీస్ ఉర్దూ ఒక్కరు ఉన్నారు. వీరికి కేటాయించిన పాఠశాలల ఆర్డర్లు శనివారం వస్తాయని డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు. కొత్త టీచర్లు 13వ తేదీ సోమవారం విధుల్లో చేరాల్సి ఉంటుందని అన్నారు.

### ముగిసిన శిక్షణ

కొత్త టీచర్లకు శిక్షణ శుక్రవారం ముగిసింది. అనంతపురం, కర్నూలు జిల్లాకు చెందిన టీచర్లకు బుక్కరాయసముద్రంలోని విజయభారతి డీఎడ్ కాలేజీ, కొర్రపాడు వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ శిక్షణా కేంద్రం, పంగల్ రోడ్డులోని వివేకానంద జూనియర్ కాలేజీలో శిక్షణ ఇచ్చారు. సమస్యలు తలెత్తకుండా విద్యాశాఖ జాయింట్ డైరెక్టరు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ పర్యవేక్షించారు. కొత్త టీచర్లకు పలు సూచనలు చేసారు. శిక్షణా కేంద్రాలలో చివరి రోజు అధికారులు, శిక్షకులు, కొత్త టీచర్లు గ్రూప్ ఫొటోలను తీసుకుంటూ సందడి చేశారు.

### మీరంటే చాలా ఇష్టం..

శిక్షణ ముగియడంతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు వర్చ్యువల్‌గా సందేశం ఇచ్చారు. డీఎస్సీ-2025 టీచర్లంటే తనకెంతో ఇష్టమని అన్నారు. నియామక ప్రక్రియలో ఎలాంటి లోపాలు, రాజకీయాలకు తావులేకుండా చూసుకున్నామని అన్నారు. పాఠశాలలకు వెళ్లి చాలా బాధ్యతగా పనిచేసి, మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమస్యలు ఉంటే నేరుగా తనను కలిసి తెలియజేయవచ్చని, పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# ఉదయం గంట.. మధ్యాహ్నం మరో గంట!

● ఇష్టారాజ్యంగా ఉద్యోగుల హాజరు

● ఎన్‌హెచ్ విభాగంలో కనిపించని సిబ్బంది

● 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో బట్టబయలు

ఆంధ్రజ్యోతి విజిట్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్‌హెచ్ (నేషనల్ హైవే) విభాగంలో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా పని వేళలు పాటిస్తున్నారు. ఉదయం ఓ గంట, మధ్యాహ్నం మరో గంట మాత్రమే కార్యాలయాల్లో కనిపిస్తున్నారు. ఈఈ, ఎస్ఈలు ఫీల్డ్‌కు వెళ్లారన్న సమాచారం ఉంటే ఆ గంట కూడా కార్యాలయానికి రారన్న విమర్శలు ఉన్నాయి. ఎన్‌హెచ్ విభాగంలోని ఈఈ, ఎస్ఈ కార్యాలయాలను 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం విజిట్ చేసింది. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు సిబ్బంది ఎవరూ కూడా ఆయా కార్యాలయాల పరిసరాల్లో కూడా కనిపించలేదు. సాధారణ రోజుల్లో కూడా మధ్యాహ్నం 12 నుంచి 1 గంటలలోపు, సాయంత్రం 4 నుంచి 5గంటల లోపు మాత్రమే కొందరు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, అప్పుడు మాత్రమే కార్యాలయానికి రావాలని అక్కడి సిబ్బంది కొందరు పేర్కొన్నారు. ఎన్‌హెచ్ ఎస్ఈగా ఉన్న హరిప్రసాద్‌కు ప్రమోషన్ రావడంతో ఆయన గత నెల 23న రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు ఈఈ సుధాకర్‌రెడ్డికి అప్పగించారు. ఈయన ఎక్కువ శాతం క్షేత్రస్థాయి పర్యటనల్లో ఉంటారన్న ప్రచారం ఉంది. దీంతో సిబ్బంది ఇష్టారీతిన కార్యాలయాలకు వస్తున్నట్లు సమాచారం. ఈఈ కార్యాలయం సమీపంలోని డీఈ డివిజన్ కార్యాలయం పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. అక్కడ అటెండర్ తప్ప మరెవరు కనిపించలేదు.

### ఎస్ఈ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు..

ఎస్ఈతో పాటు, డిప్యూటీ ఎస్ఈ, సూపరింటెండెంట్, డివిజన్ కార్యాలయంలో ఏఈ-2, సీనియర్ అసిస్టెంట్లు-2, జూనియర్ అసిస్టెంట్లు-2, టీఓ-1, ఏటీఓ-2 పోస్టులు ఉన్నాయి. ఇంత మంది ఉన్న ఏ ఒక్కరు లేక కార్యాలయం ఖాళీగా కనిపించింది.


మూసివేసిన ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయం

### ఈఈ కార్యాలయంలో కనిపించని సిబ్బంది..

ఈఈ సుధాకర్‌రెడ్డితో పాటు పీఏటూ ఈఈ రామచంద్రారెడ్డి, సూపరింటెండెంట్-1, డీఏఈ-1, టీఓ-1, సీనియర్ అసిస్టెంట్లు-3, జూనియర్ అసిస్టెంట్లు-3 అటెండర్లు-4 ఉన్నారు. వీరిలో ఒక వృద్ధురాలైన అటెండర్ తప్ప ఏ ఒక్క సిబ్బంది కనిపించలేదు. దీనిపై ఈఈ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరడానికి ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.


ఖాళీగా ఉన్న ఎస్ఈ డివిజన్ సిబ్బంది కార్యాలయం


ఖాళీగా ఉన్న ఎస్ఈ సర్కిల్ సిబ్బంది కార్యాలయం


# ఐద్వా పోరాటాలు అమోఘం

● ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మలమ్మ


మాట్లాడుతున్న ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మలమ్మ

అనంతపురం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల రక్షణకు ఐద్వా చేస్తున్న పోరాటాలు అమోఘమని ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మలమ్మ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతికోత్స వాలు రెండోరోజు శుక్రవారం కొనసాగాయి. కార్యక్రమానికి నిర్మలమ్మ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్రగ్ ఫ్రీ ఇండియా లఘుచిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నిర్మలమ్మ మాట్లాడుతూ మహిళా సమస్యలపై ఐద్వా అనేక ఉద్యమాలు చేపట్టి, హక్కుల రక్షణ కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి, చట్టాలు రూపొందించేలా చేసిందన్నారు. సావిత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ మహిళలపై దాడులు జరిగినా ముందుండి న్యాయంకోసం పోరాడుతున్నది ఐద్వానేనని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షకార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, శైలజ, గీతా, రామాంజినమ్మ, షేక్ రియాజుద్దీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చీనీ టన్ను రూ.15 వేలు



అనంతపురం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 72 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

## టమోటా కిలో రూ.19



అనంతపురం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.19తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 1650 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. కిలో కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు.

# నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్స్...

### నానాజీ దేశ్‌ముఖ్ (జయంతి)




'పద్మభూషణ్' గ్రహీత నానాజీ దేశ్‌ముఖ్ 1916 అక్టోబరు 11న మహారాష్ట్రలో హింగోలి జిల్లా కడోలి ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు చండికాదాస్ అమృతరావ్ దేశ్‌ముఖ్. సామాజిక ఉద్యమకారుడు, రాజకీయ నేతగా విద్య, ఆరోగ్యం గ్రామీణ స్వావలంబనకు కృషి చేశారు. బాలగంగాధర తిలక్‌తో స్ఫూర్తిపొంది 'భారతీయ జనసంఘ్' నేతగా ఎదిగారు. భూదాన్ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నారు. తొలి గ్రామీణ విశ్వ విద్యాలయం 'చిత్రకూట్ గ్రామోదయ్ విశ్వవిద్యాలయ'ను స్థాపించి చాన్సలర్‌గా వ్యవహరించారు. 2010 ఫిబ్రవరి 27న కన్నుమూశారు. మరణానంతరం 'భారతరత్న' ప్రకటించారు.

### సాలూరు రాజేశ్వరరావు (జయంతి)




సాలూరు రాజేశ్వరరావు 1922 అక్టోబరు 11న విజయనగరం జిల్లా సాలూరు మండలం శివరామపురంలో జన్మించారు. తెలుగు సినీ రంగంలో సుమారు ఐదు దశాబ్దాలపాటు మధురమైన గీతాలను అందించిన సంగీత దర్శకులలో ఒకరు. లలిత సంగీతానికి శ్రీకారం చుట్టి కొత్త ఒరవడి సృష్టించారు. శాస్త్రీయ సంగీత బాణీలు, కర్ణాటక, హిందూస్తానీ రాగాలలో జుగల్‌బందీలు ఇలా పలు ప్రక్రియలు సాగించారు. 'మాయాబజార్'లో అభిమన్యుడి పాత్రతో మెప్పించి గాయక నటుడిగా నిరూపించుకున్నారు. కళాప్రపూర్ణ, కళైమామణి గౌరవాలు అందుకున్నారు. 1999 అక్టోబరు 25న కన్నుమూశారు.

### థిక్ నాట్ హన్ (జయంతి)



వియత్నాం దేశానికి చెందిన సాధువు థిక్ నాట్ హన్ 1926 అక్టోబరు 11న జన్మించారు. శాంతి కోసం ఎంతోపాటుపడ్డారు. 'ప్లమ్ విలేజ్ ట్రెడిషన్'ను స్థాపించారు. 'మహాయాన' బుద్ధిజంలో తర్ఫీదు పొందారు. అమెరికాలో బుద్ధిజం లెక్చరర్‌గా కొనసాగారు. ఫ్రెంచ్, చైనీస్, సంస్కృతం, ఇంగ్లీషు, జపనీస్, పాలి బాషలలో ప్రావీణ్యం సాధించి 100కుపైగా పుస్తకాలు ప్రచురించగా ప్రపంచ వ్యాప్తంగా 50లక్షలకుపైగా అమ్ముడయ్యాయి. ఆధ్యాత్మిక ప్రసంగీకులుగా రాణిస్తున్నారు. నోబెల్ ప్రైజ్‌కు నామినేట్ అయ్యారు. 2022 జనవరి 22న కన్నుమూశారు.

### కద్రీ గోపాలనాథ్ (వర్ధంతి)



నాదస్వర విద్వాన్, 'పద్మశ్రీ' గ్రహీత కద్రీ గోపాలనాథ్ 1949 డిసెంబరు 6న దక్షిణకన్నడ జిల్లా బంట్వాళలో జన్మించారు. నాదస్వరంతోపాటు 'సాక్సోఫోన్' వాదనలో జాతీయ, అంతర్జాతీయస్థాయి కచేరీలలో పాల్గొని సాక్సోఫోన్ చక్రవర్తిగా పేరొందారు. త్యాగరాజ కీర్తనలు ఆలపించడంలో ప్రత్యేకత. కంచికామకోటి పీఠం, శృంగేరీ శారదా పీఠంలలో ఆస్థాన విద్వాన్‌గా వ్యవహరించారు. గానకళాశ్రీ, నాదోపాసన బ్రహ్మ, నాద కళారత్న, సంగీత వాద్య రత్న, కళైమామణి, రాజ్యోత్సవ అవార్డు తదతర గౌరవాలు అందుకున్నారు. 2019 అక్టోబరు 11న కన్నుమూశారు.

### అమితాబ్ బచ్చన్ (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' అమితాబ్ బచ్చన్ 1942 అక్టోబరు 11న అలహాబాద్‌లో జన్మించారు. నటుడు, నిర్మాత, గాయకుడు, వ్యాఖ్యాతగా పేరొందారు. ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న తొలి నటుడు. ఫిల్మ్‌ఫేర్ అవార్డులకు 41సార్లు నామినేట్ అయ్యారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు పొందారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. నాలుగు దశాబ్దాలలో 180 సినిమాలలో నటించారు. బుల్లితెరపై 'కౌన్ బనేగా కరోడ్‌పతి'కి హోస్ట్‌గా వ్యవహరించి మరోసారి సత్తా చాటుకున్నారు. 2000లో మేడమ్ టస్సాడ్ మ్యూజియంలో తొలి లివింగ్ ఏషియన్ విగ్రహం ఏర్పాటు కావడం విశేషం.

## పాడిరైతుల అభివృద్ధికి కృషి

**- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య**

గుడిబండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గుడిబండలో మూతబడ్డ పాల డెయిరీని త్వరలో ప్రారంభించి పాడి రైతుల అభివృద్ధికి కృషిచేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఎనిమిదవ వార్షికోత్సవ మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన సరుకులను రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వాటిని కొనుగోలు చేసి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా కృషిచేస్తుందన్నారు. మహిళా సంఘం సభ్యులు రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ కేశవరెడ్డి, ఏసీ నాగరాజు, ఏటీఎం తిప్పన్న, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం

పెనుకొండ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది పనితీరుపై కమిషనర్ సతీష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై శుక్రవారం కమిషనర్, సీఎస్‌డీటీ ప్రభావతి పర్యవేక్షించారు. ఈ క్రమంలో 3,4,5 సచివాలయ పరిధిలోని సిబ్బంది విధులకు సక్రమంగా రాలేదన్న వాస్తవాలు బయటపడ్డాయి.

## కల్తీ మద్యం అమ్మితే చర్యలు

హిందూపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం అమ్మినా, తయారుచేసినా వారిపై పీడియాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని కల్లు, మద్యం దుకాణాలు, బార్‌లను తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐలు పృథ్వీ, ఫారూక్ పాల్గొన్నారు.

# శక్తివంతమైన భారత నిర్మాణంలో విద్యార్థులే కీలకం

**» బెంగళూరు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రమేశ్**

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శక్తివంతమైన, సదృఢమైన భారత నిర్మాణంలో విద్యార్థులు కీలకమని బెంగళూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బీ రమేశ్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సాంస్కృతిక క్రీడా కార్యక్రమాలను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య అంటే కేవలం పరీక్షలు రాయడం, మార్కుల జాబితాలు పొందడం కాదని అన్నింటా నైపుణ్యత సాధించడమని పిలుపునిచ్చారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, బోధనలు జీవితానికి అర్థం నేర్పుతాయన్నారు. మిగిలిన కార్యకలాపాలు మనిషి పరిపూర్ణతకు మార్గం అవుతుందన్నారు. కళాశాలనుంచే భవిష్యత్తును రూపొందించుకోవాలని సూచించారు. జాతీయ భావైక్యత, భవ్య భారతాన్ని మరింత పటిష్టం చేయడం నేటి యువ విద్యార్థులపై ఉందనేది గుర్తుంచుకోవాలన్నారు. కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ బంగారుపతక విజేత ఉషా మాట్లాడుతూ విద్యార్థులకు శ్రద్ధ ముఖ్యమని, శ్రద్ధతో సాధన చేస్తే ఎంతటి స్థాయికైనా చేరవచ్చునన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీసీ నాగేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. సాంస్కృతిక సంచాలకులు డాక్టర్ శశికళ, ఫిజికల్ డైరెక్టర్ ఆనంద్, కన్నడ అధ్యాపకులు రుద్రేశ్ అదరంగి, డాక్టర్ హెచ్‌జీ నారాయణ, డాక్టర్ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను ప్రారంభిస్తున్న బెంగళూరు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రమేశ్ తదితరులు

## జీవితంలో క్రీడలు మహత్తరమైనవి

**» ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి**



ట్రోఫీతో క్రీడాకారుల బృందం

దొమ్మసంద్ర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలు జీవితంలో ఎంతో మహత్తరమైనవని అవి కేవలం గెలుపోటములు కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం కలిగిస్తాయని సర్దార్‌వల్లభాయ్ పటేల్ పీయూ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌టీ శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సర్జాపురలోని కళాశాల ఆవరణలో పీయూ బెంగళూరు దక్షిణజిల్లా, బెంగళూరు పీయూ కళాశాలల జిల్లాస్థాయి ఖోఖో క్రీడా పోటీలలో ద్వితీయస్థానం సాధించిన విద్యార్థుల బృందాన్ని శుక్రవారం అభినందించి మాట్లాడారు. విద్యార్థులు పాఠాలతోపాటు క్రీడల్లోకూడా రాణించాలన్నారు. క్రీడల్లో తరచుగా పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. నేటి తరానికి పాఠాలతోపాటు క్రీడల అవసరం ఎంతైనా ఉందన్నారు. బెంగళూరు దక్షిణ జిల్లా స్థాయిలో ఖోఖో పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు తమదైన సత్తా చాటుకుని ద్వితీయస్థానంలో నిలిచారన్నారు. వచ్చే ఏడాది పోటీలలో ప్రథమస్థానం సాధిస్తారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుకోవాలని హితవు పలికారు. కాగా నవంబరులో మండ్యజిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాపోటీలకు కళాశాల విద్యార్థులు విజయ్‌కుమార్, ప్రజ్వల్‌గౌడ, నిలేశ్‌కుమార్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్‌లు ప్రేమ బీఆర్, శ్రీనివాస్ హెచ్‌కే, కవన, రమణరెడ్డి, చంద్రశేఖర్, పీఈటీ రాజేశ్, ప్రతిభా, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్‌పాస్‌లో స్వచ్ఛత పనులు

చింతామణి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చేళూరు రోడ్డు రైల్వే అండర్‌పాస్ వద్ద డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వచ్చి సమస్య తలెత్తడంపై ప్రజలు మంత్రి సుధాకర్‌కు ఫిర్యాదు చేసిన మేరకు స్పందించారు. శుక్రవారం స్వయంగా రైల్వే అండర్‌పాస్ ప్రాంతాన్ని పరిశీలించారు. డ్రైనేజీలో పేరుకున్న పూడికను పొక్లైనర్‌లతో తొలగించారు. అలాగే రోడ్డుపైకి వచ్చిన మురుగునీటిని అగ్నిమాపక సిబ్బంది జెట్టింగ్ యంత్రాల ద్వారా తొలగించి శుభ్రం చేశారు. నగరసభ అధికారులు, స్వచ్ఛతా సిబ్బంది పాల్గొని కార్యాచరణలో పాల్గొన్నారు. కొన్నిరోజులుగా ఉన్న సమస్య ఎట్టకేలకు మంత్రి చొరవతో పరిష్కారం కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి వెంట నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి, నగరసభకు చెందిన సీకే బాబు, నగరసభ సభ్యులు, తదితరులు ఉన్నారు.



పరిశీలిస్తున్న మంత్రి సుధాకర్



శుభ్రం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## సీజేకు అవమానంపై నిరసన

**» దివిటీల ర్యాలీ - దిష్టిబొమ్మ దహనం**

బంగారపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అత్యున్నతమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పట్ల అవమానించేలా న్యాయవాది షూ విసిరిన తీరును కర్ణాటక దళిత రైతుసేన ఖండించింది. సంఘం రాష్ట్ర అధ్య క్షుడు హుణసనహళ్ళి వెంకటేశ్ నేతృత్వంలో నిరసన వ్యక్తం చేశారు. దివిటీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. దిష్టిబొమ్మను దహనం చేశారు. షూ విసిరిన వ్యక్తిని దేశద్రోహిగా పరిగణించి తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళిత సంఘర్ష సమితి జిల్లాసంచాలకులు యల్లప్ప మాట్లాడుతూ న్యాయమూర్తిపై షూ విసిరే యత్నం అత్యంత తీవ్రంగా పరిగణించాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానానికి ఉన్నతస్థానం గౌరవ ఉందని, న్యాయమూర్తుల పట్ల అనుచిత ప్రవర్తన సరికాదన్నారు. నిరసనలో అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుపేంద్ర, దళిత ప్రముఖులు నవీన్, సక్కనహళ్ళి మునిరాజు, మధివణ్ణన్ పాల్గొన్నారు.



దివిటీలతో నిరసన తెలుపుతున్న నాయకులు

## ఆభరణాలు కొనుగోలు చేయండి

**» జ్యువెల్స్ ఆఫ్ ఇండియా మేళాలో నటి సమంత పిలుపు**





జ్యువెల్స్ ఆఫ్ ఇండియా ప్రదర్శనను ప్రారంభిస్తున్న నటి సమంత

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పండుగలకోసం కోరుకున్న సరికొత్త డిజైన్లు ఆభరణాలు కొనుగోలు చేయాలని ప్రముఖనటి సమంత పిలుపునిచ్చారు. ప్యాలెస్ మైదానం త్రిపురవాసినిలో ఏర్పాటు చేసిన జ్యువెల్స్ ఆఫ్ ఇండియా 27వ మేళాను శుక్రవారం సమంత లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ బంగారం అంటే మహిళలకు ఎంతో ఇష్టమన్నారు. బంగారం కొనుగోలుకు నేను ఆసక్తి చూపుతానన్నారు. ప్రాచీన డిజైన్లు అద్భుతంగా ఉంటాయన్నారు. దేశంలో భిన్నమైన భాషల తరహాలోనే భిన్నమైన ఆభరణాల డిజైన్లు ఉన్నాయన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను డిజైన్ల రూపంలో తీసుకురావడం సంతోషమన్నారు. బెంగళూరు ప్రజలు పరిపూర్ణమైన పండుగను చేసుకునేందుకు జ్యువెల్స్ ఆఫ్ ఇండియా ప్రదర్శనలో కోరుకున్న డిజైన్లు దక్కించుకోవాలన్నారు. దేశంలో పేరొందిన వంద బ్రాండ్ల జ్యువెల్స్‌సంస్థలు పాల్గొన్నట్టు జ్యువెల్స్ ఆఫ్ ఇండియా కన్వీనర్ విక్రమ్ మెహతా తెలిపారు. ఆదివారం వరకు ప్రదర్శనలు ఉంటాయన్నారు.

## సమస్యల పరిష్కారానికే గ్రామసభ : ఎమ్మెల్యే

మహదేవపుర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలిచాక పంచాయతీ గ్రామసభలకు సభ్యులు రాకపోవడం తగదని, సమస్యల పరిష్కారానికే సభలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే మంజుళా లింబావళి అన్నారు. కణ్ణూరు గ్రామపంచాయతీలో మొత్తం 31మంది సభ్యులు ఉండగా గురువారం ఏర్పాటైన సమావేశానికి 17మంది హాజరు కాగా 14మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సభ్యులందరూ పాల్గొని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన మహిళలకు బహుమతులు అందజేసి సత్కరించారు. కణ్ణూరు గ్రామపంచాయతీలో చెత్తన డంప్ చేయరాదని ప్రభుత్వంపై తాము ఒత్తిడి తెస్తున్నామన్నారు. కణ్ణూరు పంచాయతీ అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారానికి ఏర్పాటైన సభకు సభ్యులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తాలూకా పంచాయతీ ఈఓ వసంత్‌కుమార్, ఉపాధ్యక్షురాలు లలితా దేవరాజ్, పీడీఓ గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి

## పెళ్లికి నిరాకరించిన వివాహిత

**» ఆత్మహత్య చేసుకుని... ఆమెనూ బలిగొన్న ప్రియుడు**

బెంగళూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): యలహంక లాడ్జ్‌లో అగ్నిప్రమాదంలో ఇరువురి మృతికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. న్యూటౌన్‌లో కిచెన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌కు అనుబంధంగా కూల్ కంఫర్ట్ అనే లాడ్జ్ ఉంది. గురువారం సాయంత్రం కాలినగాయాలతో ఓ యువకుడు మృతి చెందగా పొగమంటలతో ఊపిరాడక ఓ మహిళ దుర్మరణం చెందారు. పోలీసులు వివిధ కోణాలలో పరిశీలించిన మేరకు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన మేరకు గదగ్‌కు చెందిన రమేశ్, హుణగుందకు చెందిన కావేరిలు మృతి చెందినవారిగా గుర్తించామన్నారు. ఇద్దరు వారం రోజులుగా ఒకే గదిలో ఉన్నారన్నారు. కావేరికి 2016లో వివాహం కాగా ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు. అయితే ఉపాధికోసం బెంగళూరుకు వచ్చిన కావేరి ఓ స్పా కేంద్రంలో పనిచేస్తుండేవారన్నారు. తాపీమేస్త్రీ పనిచేసే రమేశ్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. ఇలా ఇద్దరిమధ్యా స్నేహం కాస్త ప్రేమగా మారిందన్నారు. ఇద్దరూ లాడ్జ్‌లో గడుపుతున్నారు. గురువారం ఉదయం ఇద్దరిమధ్యా గొడవ జరిగింది. రమేశ్ పెళ్లి చేసుకుందామని డిమాండ్ చేయగా కావేరి అంగీకరించలేదు. దీంతో మధ్యాహ్నం లాడ్జ్‌రూంకు వాపసు వచ్చిన రమేశ్ ఓబాటిల్‌లో పెట్రోల్‌ను తీసుకొచ్చాడు. పెళ్లికి ఒప్పుకోవా అంటూ పెట్రోల్ పోసుకుని రమేశ్ నిప్పు పెట్టుకున్నాడు. మెయిన్‌డోర్ లాక్ చేయడంతో కావేరి బాత్రూంకు వెళ్లి స్పా ఓనర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకునేసరికి లాడ్జ్ యాజమాన్యం మంటలు ఆర్పి వారిని బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అయితే గదిమొత్తం మంటలు చెలరేగడంతో ఊపిరాడక కావేరి మృతి చెందారు. పెళ్లికి అంగీకరించలేదని ఆత్మహత్య చేసుకున్న రమేశ్, ఆమె సహచరిని కూడా బలిగొన్నాడు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప**

హిందూపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయితేజ ఫంక్షన్‌హాల్‌లో కిరికెర సింగిల్‌విండో అధ్యక్షులు శంకర్ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల కన్వీనర్ రాము, పట్టణ కన్వీనర్ వెంకటేశ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, నాయకులు నాగరాజు, అరుణాచల్‌రెడ్డి, మంజునాథ్, లీగల్‌సెల్ అధ్యక్షులు శివశంకర్ పాల్గొన్నారు.

## నేటినుంచి సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు



సామవేదం షణ్ముఖశర్మ

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మారతహళ్ళిలోని న్యూహారిజన్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శనివారం నుంచి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. గడిచిన 23ఏళ్లుగా ఏటా నగరంలో ఆధ్యాత్మిక జ్ఞానామృత ప్రవచనాలు కొనసాగుతున్నాయన్నారు. దేవీ మహాత్యం (చండీ సప్తశతి) అనే అంశంపై ఆరురోజులపాటు ఆధ్యాత్మిక ప్రవచనం కొనసాగుతుందన్నారు. నగర ప్రజలు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు జరిగే ప్రవచనాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల 17న కళైమామణి నాదనిధి బిరుదాంకితులైన బీవీ బాలసాయి నేతృత్వంలో శివపదం గానకచేరి ఉంటుందన్నారు.

## మారెమ్మ ఆలయంలో మండలపూజ



కలశాలతో మహిళాభక్తులు

శిడ్లఘట్ట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వీరాపుర గ్రామంలో గ్రామదేవత పిళ్కేకి మారమ్మ దేవాలయ జీర్ణోద్ధరణను పురస్కరించుకుని దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి 48వ రోజు మండలపూజ, 50వ రోజు బొట్టుపూజ చేశారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధులలో ఊరేగించారు. ఇంటిముంగిట రంగవల్లులు వేసి స్వాగతించి టెంకాయలు కొట్టారు. అర్చకుడు వెంకటేశ్, క్రైయ్యప్ప, అంగడి మునియప్పలు పర్యవేక్షించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## నగరంలో నాలుగు పాపాజాన్స్ రెస్టారెంట్‌లు

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాశ్చాత్య ఆహార పదార్థాలకు పేరొందిన పాపాజాన్స్ నగరం ప్రజలకు అనుకూలంగా నాలుగుచోట్ల రెస్టారెంట్లను తెరిచినట్టు ప్రకటించారు. ఇందిరానగర్‌లో శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. పిజ్జా బ్రాండ్‌కు పాపాజాన్స్ పేరొందింది. ఎలక్ట్రానిక్‌సిటీ, హెణ్ణూరు, సర్జాపుర రోడ్డులలో శాఖలను అందుబాటులోకి తెచ్చినట్టు వీజీపీ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ సీఈఓ తపన్‌వైద్య ప్రకటించారు. బెంగళూరు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్న నగరమని అందుకు అనుగుణంగానే రెస్టారెంట్ల ద్వారా కోరుకున్న ఫుడ్లను అందుబాటులోకి తెచ్చామన్నారు.

## ఆస్తికోసం అల్లుడిని కడతేర్చిన మామ



బసవరాజ్ (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇల్లు, ఆస్తి, బీమా సొమ్ము కోసం ఏకంగా అల్లుడినే హత్య చేసి కట్టుకథ చెప్పిన మామ ఉదంతాన్ని పోలీసులు బహిరంగం చేశారు. హావేరి జిల్లా రట్టిహళ్ళి పట్టణంలో బసవరాజ్ (38) సెప్టెంబరు 27న హత్య జరిగింది. బసవరాజ్ తల్లిదండ్రులతోపాటు సోదరుడు మృతి చెందారు. ప్రస్తుతం ఇతను ఒక్కడే ఉన్నాడు. కోట్లాదిరూపాయల ఆస్తి, బీమా ఇతడి పేరిట ఉంది. బసవరాజ్ మద్యానికి బానిసయ్యాడు. ఇదే విషయాన్ని మామ సిద్దనగౌడ హలగేరి అవకాశంగా తీసుకున్నాడు. బసవరాజ్‌కు చెందిన 8 ఎకరాల భూమిని, ఇంటిని దక్కించుకోవాలని కుట్ర పన్నాడు. అయితే బసవరాజ్ తమ్ముడి తరపు బంధువులు ఆస్తులు విక్రయించకుండా కోర్టునుంచి స్టే తెచ్చుకున్నారు. దీంతో ఆస్తి లభించదని భావించిన సిద్దనగౌడ సహచరులతో కలసి బసవరాజ్ పేరిట 50వేల ప్రమాదబీమా పాలసీ చేశారు. ఆ తర్వాత బసవరాజ్‌ను పార్టీకోసం అంటూ తీసుకెళ్లారు. మరికొసేపు మేం ఇక్కడే ఉంటామన్నారు. బసవరాజ్ బైక్‌పై వెళ్తుండగా వెనుకనుంచి కారులో వచ్చి ఢీ కొట్టారు. బసవరాజ్ తీవ్రగాయాలతో మృతి చెందారు. రోడ్డుప్రమాదంలో బసవరాజ్ మృతి చెందారని నమ్మించినా హత్య అయి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. పోలీసులు విభిన్నమైన కోణాలలో పరిశీలించగా హత్యగా నిర్ధారణ అయ్యింది. ఆస్తికోసం మామయే కుట్ర పన్నినట్టు గుర్తించారు. సిద్దనగౌడ హలగేరితోపాటు రాఘవేంద్ర, ప్రవీణ్, లోకేశ్ అనేవారిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

## రాజకీయ జోక్యం తగదు

**సర్పంచుల సంఘం అధ్యక్షుడు అంజీనాయక్**

సోమందేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధిలో రాజకీయ జోక్యం తగదని సర్పంచుల సంఘం అధ్యక్షుడు అంజీనాయక్ అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ప్రణాళిక సంఘం నిధులు సర్పంచ్ ఖాతాకు జమ అయినా రాజకీయ అడ్డంకులతో వాడుకోలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. చేసిన పనులకు బిల్లులు అందకపోతే కొత్త పనులు ఎలా చేపట్టాలని ప్రశ్నించారు. మంత్రి సవిత చొరవ చూపాలని కోరారు. ఎస్‌ఐ రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ నర్సింగరావు, ఎంపీపీ గంగమ్మ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. రెగ్యులర్ ఎంపీడీఓ వెంకటలక్ష్మీ సోమవారం విధులకు హాజరవుతారని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## సర్పంచులు రోడ్డెక్కడం సరికాదు: టీడీపీ

సోమందేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్పంచులు నిధులకోసం రోడ్డెక్కడం సరికాదని టీడీపీ మండల నాయకులు విమర్శించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సవవేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు 14వఫైనాన్స్ నిధులు మంజూరైనా వైసీపీ ప్రభుత్వం తన అవసరాలకు వాడుకుందన్నారు. అప్పుడు ప్రశ్నించని సర్పంచులు ప్రస్తుతం ఇలా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. 15వ ఫైనాన్స్ నిధులు విడుదలై సర్పంచ్, కార్యదర్శి జాయింట్ ఖాతాలకు జమ అయ్యాయన్నారు. ఎంపీడీఓ వెంకటలక్ష్మీ శిక్షణలో భాగంగా సెలవుపై వెళ్లడం, ఈఓఆర్డీ రిటైర్డ్ అవ్వడంతో కొంత ఇబ్బందులున్న విషయం వాస్తవమేనన్నారు. వైసీపీ సర్పంచులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1625.89 | 1631.92 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 6,564 | 11,784 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 10,250 | 14,981 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 79.43 | 101.46 |

## డీవైఎస్పీగా న్యామనగౌడ బాధ్యతల స్వీకరణ



గంగావతి రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గంగావతి నూతన డీవై ఎస్పీగా న్యామనగౌడ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గంగావతి బీజేపీ యువ మోర్చా నగర శాఖ అధ్యక్షుడు వెంకటేశ్ హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశామని, హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని, పంచనామా నిర్వహించి నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి తరలించామన్నారు. ఇది బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన దృష్టికి వచ్చిన మొదటి కేసని, దోషులకు శిక్ష తప్పదన్నారు. హతపై పూర్తి వివరాలు సేకరించామన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు విడుదల : ఎమ్మెల్యే

హొస్పేట, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): కమలాపూర్ పట్టణ మున్సిపాలిటీలోని 21 వార్డులలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల కోసం రూ. 15కోట్లు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప తెలిపారు. శుక్రవారం ఆయన తాలూకాలోని కమలాపూర్ మున్సిపాలిటీ ప్రాంగణంలో రూ. 1.80కోట్లతో కొత్తగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపూర్‌లోని ప్రతి వార్డులో సీసీ రోడ్డు, మురుగు నీటిపారుదల, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి గ్రాంట్లు విడుదలయ్యాయన్నారు. దీని కింద ఈ నెలాఖరులోగా వివిధ పనులకు భూమి పూజ చేపడ్తామన్నారు. కమలాపూర్ మున్సిపాలిటీ స్థాపన, అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యేలు అధి ధికప్రాధాన్యం ఇచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత వారసత్వ ప్రదేశమైన హంపీని సందర్శించడానికి అధిక మంది పర్యాటలకును ఆకర్షించే ఉద్దేశంతో పనులు చేపడ్తామన్నారు. ఎంపీ తుకారాం, ఎమ్మెల్యే అన్నపూర్ణ , ఎస్పీ జాహ్నవి, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ హెచ్‌ఎన్‌ఎఫ్ ఇమామ్ నియాజీ,మున్సిపల్ చైర్మన్ అమీనా, వైస్‌చైర్మన్ హెచ్ గోపాలకృష్ణ, స్టాండింగ్ కమిటీచైర్మన్ అజయ్‌కుమార్, సభ్యులు రాజా, సయ్యద్ అమానుల్లా, జి అన్వర్, కెవి సరిత, ముఖ్తియార్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవాలి

● దెబ్బతీస్తే మానవాళికి నాశనం తప్పదు ● రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి 'స్వర్ణోత్సవం'లో మంత్రి ఈశ్వర ఖండ్రే



మాట్లాడుతున్న ఎంపీ తుకారాం



మంత్రి ఈశ్వర్ ఖండ్రే



చైర్మన్ నరేంద్ర స్వామి

బళ్లారి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రకృతిని దెబ్బ తీస్తే విపత్తులు తప్పవని రాష్ట్ర అటవీశాఖ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే అన్నారు. శుక్రవారం బళ్లారి, విజయనగర జిల్లాలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి "స్వర్ణోత్సవం" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బళ్లారిలోని ప్రభుత్వ కళాశాల మైదానంలోనూ విజయనగర జిల్లాలో జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రకృతి, పర్యావరణం దెబ్బతింటుండడం వల్ల వాతావరణంలో అనేక మార్పులు సంభవించి అనర్థాలు సంభవిస్తున్నాయన్నారు. వాయుకాలుష్యం, జలకాలుష్యం, శబ్ద కాలుష్యం ఎక్కువై అనేక నష్టాలకు కారణం అవుతున్నాయని అన్నారు. కరోనా వ్యాపించిన కాలంలో ఆక్సిజన్ కొరత కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ఆక్సిజన్ ఇవ్వగలిగేది ఒక్క చెట్టే అని మంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 కోట్ల మొక్కలు నాటినట్లు మంత్రి తెలిపారు. ఐక్యరాజ్య సమితి సమావేశంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ పై మాట్లాడారన్నారు. తరువాత 1974లో కేంద్ర ప్రభుత్వ కాలుష్య నియంత్రణ బోర్డును స్థాపించారన్నారు. ఈ సందర్భంగా ఆమె పేరుతో రాష్ట్రంలో స్వర్ణోత్సవం జరపుకుంటున్నామన్నారు.

రాష్ట్రంలో సుమారు కోటి ఎకరాలు అటవీ ప్రాంతం ఉందన్నారు. రాష్ట్రంలో అటవీ ప్రాంతం పెంచడానికి ప్రాముఖ్యత ఇస్తామన్నారు. సహజ పర్యావరణానికి వన్యప్రాణులు చాలా అవసరం అన్నారు. రాష్ట్రంలో 5 జాతీయ ఉద్యానవనాలు, 5 పులుల అభయారణ్యాలు, 37 వన్యప్రాణుల అభయారణ్యాలు, 19 వన్యప్రాణులు అభయారణ్యాలు, ఉన్నాయన్నారు. దేశంలో ఏనుగుల సంఖ్యలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. మొత్తం 6,395 ఏనులుగు, 563 పులులు, ఉన్నాయన్నారు. కాలుష్య నిమంత్రణ మండలి చైర్మన్ పీఎం నరేంద్ర స్వామి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మైనింగ్, ఇతర పరిశ్రమల వల్ల పర్యావరణం బాగా దెబ్బతింటుంది. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ అని అన్నారు. బళ్లారి జిల్లాలో మైనింగ్ వల్ల కలిగే అధిక వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి కర్ణాటక మైనింగ్ ఎన్విరాల్‌మెంట్ రిస్టోరేషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించిందన్నారు. ఎంపీ తుకారాం మాట్లాడుతూ మైనింగ్ కు బళ్లారి జిల్లా ఖ్యాతి గడించింది. ఇక్కడ మైనింగ్ కార్యకలాపాలు జరిపే సమయంలో పర్యావరణానికి నష్టం కలుగుతోందన్నారు. దీని పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గనులు, వృక్షజాలం, వన్యప్రాణులు, పర్యావరణం కు జరిగే నష్టం పై శాస్త్రవేతలు అధ్యయనం నిర్వహించాలని కోరారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ, మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా కో-ఆర్డినేటర్ వెంకటేష్ హెగ్డే, జిల్లా కాంగ్రెస్ పార్టీ హమీ పథకాల అమలు అథారిటీ చైర్మన్ కే.ఇ చిదానందప్ప, విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప, డీఎఫ్‌వో కె.ఎస్. బసవరాజ్, సబ్-డివిజనల్ అధికారి ప్రమోద్, కమిషనర్ మంజునాథ్, ఇతర అధికారులు హజరయ్యారు.

### ఎస్పీ శోభారాణి రాగానే విద్యార్థుల సందడి

స్వర్ణోత్సవ సంబరాల్లో ఎస్పీ శోభారాణి చేరుకోగానే విద్యార్థులు సందడి చేశారు. వేదిక పై అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే, ఎంపీ తుకారాం. ఎమ్మెల్యే అన్నపూర్ణ, ఇతర ఎంతో మంది ప్రజాప్రతినిధులు, జిల్లా వివిద శాఖల్లో పనిచేఉన్నత అధికారులు వేదిక పై ఉన్నారు. సమావేశానికి విద్యార్థులు, జిల్లా నలమూల నుండి ప్రజలు, పార్టీల కార్యకర్తలు హజరయ్యారు. పర్యావరణం పై అందరూ ప్రసంగించారు. ఇక ఎస్పీ శోభారాణి పేరును సభలో ప్రసంగించారు, అయితే అంత వరకూ సైలెంట్‌గా ఉన్న సభా ప్రాగాణం సంతోష కేకలతో ఊర్రూతలూగింది. ముఖ్యంగా వివిధ కళాశాలల విద్యార్థులు ఆమె రాగానే కేకలు వేశారు. ఆమె తరచూ పాఠశాలలు దర్శించడం, విద్యార్థులతో మమేకం కావడమే కారణమని పులువురు చర్చించుకున్నారు. అయితే రాజకీయ నాయకులు కూడా ఆమె పాలోయింగ్ చూసి ఆశ్యర్యం చెందారు. మంత్రి, ఎంపీ. ఎమ్మెల్యేలు కూడా 'ఒకే వెల్‌డన్' అంటూ వెళ్లిపోవడం కనిపించింది.



వేదిక పై ఎస్పీ శోభారాణి

# బాలిక పై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారం

రాయచూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బస్సు కోసం నిరీక్షిస్తున్న 8వ తరగతి చదువుతున్న బాలికను గుర్తు తెలియని వ్యక్తి ఒకరు సమీపంలోని గుట్ట ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గురువారం సాయంత్రం బాలిక మాన్వి బస్‌స్టేషన్‌లో బస్సు కోసం నిరీక్షిస్తుండగా ఓ వ్యక్తి బాలిక వద్దకు వచ్చి మాయమాటలతో బస్‌స్టాండ్ సమీపంలోని గుట్ట పక్కలకి తీసుకెళ్లాడు. బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. విషయం బయటికి చెబితే



చంపేస్తానంటూ బెదిరించడంతో భయపడిన బాలిక శుక్రవారం విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి బోరుమంది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాన్వి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా అత్యాచారం జరిగిన విషయాన్ని చెబుతున్న బాలిక ఆ వ్యక్తిని గుర్తించలేకపోయినట్లు తెలిపింది. తలకు హెల్మెట్ ధరించడం వల్ల మొహ సరిగ్గా చూడలేదని, చెప్పడంతో వాటి ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.



గడిగి చెన్నప్ప సర్కిల్‌లో కాలువ పనులు

## మరమ్మతులతో ఇబ్బందులు

● ప్రధాన రహదారుల్లో కొనసాగుతున్న పనులు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

బళ్లారి సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని గడిగ చెన్నప్ప సర్కిల్(రాయల్) నుంచి రైల్వే అండర్‌పాస్ వరకు జరుగుతున్న అభివృద్ధి పనులు నగరవాసులకు చుక్కలు చూపిస్తున్నాయి. బుధవారం నుంచి పనులు ప్రారంభం కావడంతో పలు చోట్ల రాకపోకలు నిలిపివేశారు. రాయల్ సర్కిల్ వద్ద నిర్మాణ పనుల కారణంగా వాహనాలను అనుమతించడం లేదు. పనులు పూర్తి అవడానికి 20రోజులు పైగా పడుతోందని ప్రజా పనుల శాఖ అధికారులు తెలియజేశారు. దుర్గమ్మ ఆలయం నుంచి గవియప్ప సర్కిల్ వైపు రెండు దిశలలో ట్రాఫిక్ నిలిపివేశారు. ఒక వైపు దుర్గమ్మ ఆలయం దగ్గర, మరోవైపు రాయల్ సర్కిల్ దగ్గర బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీని కారణంగా చుట్టుప్రక్కల ప్రాంతంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు దాటాలంటే ఇబ్బంది పడుతున్నారు.



దుకాణంలోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

## వర్షాలతో నీటమునిగిన పొలాలు



చేనులోకి వెళ్లలేక గట్టుపైనే వేచియున్న రైతులు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లాలో భారీ వర్షాలతో పంటలు నీటమునిగాయి. పలు చోట్ల పొలాలు జలమయం అయ్యాయి. ప్రధానంగా జిల్లా పరిధిలోని హరపనహళ్ళి తాలూకాలో కురిసిన వర్షాలతో వరిచేళ్ళు మునగడంతో రైతులు తీవ్రనష్ట పోయారు. ఈసారి అతివృష్టి కారణంగా పంటచేతికి రాకుండా పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారుల అంచనాల ప్రకారం సుమారు తాలూకా పరిధిలో 200 ఎకరాలకు పైగా వరిపంట నీట మునిగినట్లు అంచనా వేస్తున్నారు. తాలూకా పరిధిలోని అరిసకెర ఫిర్కా,పుణబఘట్ట, కురెమాగనహళ్ళి, తుంబిగెర, ఉజ్జంగి దుర్గ గ్రామాల్లో బుధ, గురువారం రెండు రోజుల పాటు కురిసిన వర్షాలతో కెరెమాగనహళ్ళి చెక్‌డ్యామ్ పూర్తి స్థాయిలో నిండడంతో ఉజ్జంగి దుర్గ, అరసికెర రోడ్డు జలావృతమైంది. జంగమ తుంబిగెరెలో చెరువు నిండి బయటకు నీరు రావడంతో చుట్టుప్రక్కల ఉన్న వరి పొలాలు నీటి జల మయం అయ్యాయి. దీంతో హొసపేట, మరియమ్మనహళ్ళి భాగాల్లో భారీగా వర్షాలు కురిసాయి.



భారీ వర్షానికి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

### చారిత్రక పోరాటానికి కేంద్రం దిగి రావాల్సిందే

రాయచూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం సాగుతున్న చారిత్రక పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందేనని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస అన్నారు. రెండున్నర ఏళ్లుగా నిరవధిక సమ్మె కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం రాయచూరుకు ఎయిమ్స్ మంజూరు చేయకుండా జాప్యం చేస్తుండడం ఆశ్చర్యకరమన్నారు. నగరంలోని మహాత్మ గాంధి స్టేడియంలో నిర్వహిస్తున్న ఎయిమ్స్ నిరవధిక సమ్మె దీక్ష శిబిరంలో శుక్రవారానికి 1247వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ బసవరాజ్ కళస, ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఎయిమ్స్‌ను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎయిమ్స్ మంజూరుకు సమ్మతించిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా పోరాడాలన్నారు.

## రూరల్ డీఎస్పీగా మాలతేష్ కూనబేవు

బళ్లారి రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప డీఎస్పీగా మాలతేష్ కూనబేవు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో బెంగళూరు సీఐడీ నుంచి సిరుగుప్ప రూరల్ సబ్ డివిజన్‌కు ఆయన బదిలీ అయ్యారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజు శుక్రవారం ఆయన్ని కలిసి అభినందించారు.



డీఎస్పీని అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

# హోసూరు జోన్



చెల్లాచెదురైన నర్సరీలోని మొక్కలు

## వర్షాలతో నర్సరీలకు భారీ నష్టం

హోసూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో నర్సరీ తోటలు దెబ్బతిన్నాయి. నర్సరీలలోని మొక్కలు రోడ్లపై కూడా చెల్ల చెదురుగా పడ్డాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి నర్సరీలలో ఎక్కువ నష్టం వాటిల్లింది. నర్సరీల నుంచి తమిళనాడుకు మాత్రమే కాక విదేశాలకు ఎగుమతి చేసేవారమని, వర్షం కారణంగా లక్షలాదిరూపాయల నష్టం వాటిల్లిందని పలువురు నర్సరీల నిర్వాహకులు వాపోయారు. ప్రధాన కారణం సమీపంలోనే రింగ్‌రోడ్డు నిర్మాణ పనుల కారణంగా వర్షపునీరు నర్సరీలలోకి చొచ్చుకు వచ్చిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో తలెత్తిన సమస్యను అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. అందువల్ల జిల్లా అధికారులు స్వయంగా పరిశీలించి వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు వ్యవస్థ చేయాలని నర్సరీ రైతులు కోరుతున్నారు.

## రామజ్యోతి మృతులకు నివాళి



నివాళి అర్పిస్తున్న తమిళనాడు విశ్వహిందు పరిషత్ సభ్యులు

హోసూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రామజ్యోతి ఊరేగింపులో 1990 అక్టోబరు 10న పోలీసుల తుపాకీ కాల్పులకు మృతి చెందిన వారికి తమిళనాడు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులు అర్పించారు. హోసూరు బండాంజనేయ స్వామి ఆలయం ముందు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కోయంబత్తూరు నిర్వాహకుడు ప్రభు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. కృష్ణగిరి తూర్పు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసన్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి మంజుస్వామి, జిల్లా తోపుడుబండ్ల అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, దుర్గావాహిని, నిర్వాహకులు నందిని, శరణ్య, లక్ష్మీదేవి, అమల, జిల్లా భజరంగ్‌దళ్ శరత్‌కుమార్, శరణ్ , ఆది, నగర యూనియన్ ఇన్‌ఛార్జీలు పాల్గొన్నారు.

### నవంబరులో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కుంభాభిషేకం

హోసూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): హోసూరు బాగలూరు రోడ్డులో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని నిర్మించారు. నవంబరులో ఆలయ కుంభాభిషేకం జరగనుంది. ఆలయ ప్రారంభం కోసం ఎన్నో ధార్మిక సంప్రదాయాలు పాటించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా శుక్రవారం ముహూర్త స్తంభం పూజ నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. హరోహర అంటూ భక్తులు నినదించారు.



విశేషపూజల్లో పాల్గొన్న భక్తులు

## ప్రసన్నానంద స్వామీజీ కోలుకోవాలని పూజలు



కనకదుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

బళ్లారిరూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహాసంస్థాపక గురు పీఠానికి చెందిన జగద్గురువు ప్రసన్నానందపురి స్వామీజీ అస్వస్థతకు లోనయ్యారు. ఆయన త్వరగా కోలుకోవాలని బళ్లారి మహానగరపాలిక 22వ వార్డు కార్పొరేటర్ సభ్యులు వాల్మీకి సంఘం సీనియర్ నాయకులు కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం సీనియర్ నాయకులు రుద్రప్ప, హరి, మీనళ్లి వెంకటేష్, రూపనగుడి, రామాంజనేయులు, గడ్డం తిమ్మప్ప, పెద్దయర్రిస్వామి, యర్రప్ప, దుర్గన్న, వీరేష్, హేమంత్ రాజ్ రామాంజి, వన్నూరుస్వామి, రామకృష్ణ, అర్దగిరి దుర్గన్న, తిమ్మప్ప, భీమలింగ, చెరువు భాస్కర్, ఈరన్న, నారాయణ, వణిగనూరు శ్రీనివాస్, వాల్మీకి కుల బాంధవులు తదితర ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.

# మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో సివిల్ కోర్టు న్యాయాధికారి రాజేష్ హొసమనె



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి రాజేష్ హొసమనె

బళ్లారి సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని జిల్లా సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె అన్నారు. జిల్లాపరిపాలన ,జిల్లాపంచాయతీ, జిల్లాన్యాయ సేవల అథారిటీ , జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ , జిల్లాసమాచార ప్రజా సంబంధాల శాఖ, శ్రీమతి అల్లం సుమంగళమ్మ మెమోరియల్ మహిళా కళాశాల, జిల్లా మానసిక ఆరోగ్య క్రమం విభాగం సహకారంతో శ్రీమతి అల్లం సుమంగళమ్మ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవలి కాలంలో పనిభారం అధికం కావడంతో ప్రతి ఒక్కరిలో మానసిక ఒత్తిడి పెరుగుతోందన్నారు. ఖాళీ సమయంలో మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి కార్యకలాపాలను అవలంబించాలని సూచించారు. మానసిక ఒత్తిడి బలహీనం కాదు, మనం ఊహించడం ఆలోచించడం మానేయాలి, ఇతరులతో సంభాషణలు ,సంభాషణల ద్వారా మానసిక ఒత్తిడిని నివారించవచ్చన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో రోజువారీ సమస్యలను స్నేహితులు కుటుంబసభ్యులతో బహిరంగంగా చర్చించడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. జిల్లా మానసిక వైద్యుడు డాక్టర్ నంద కిషోర్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి శారీరక ఆరోగ్యానికి అంతే ప్రాధాన్యం ఇవ్వాలని, మెదడు, మనస్సు అనే ఐదు ఇంద్రియాలను నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. ఒత్తిడి మానసిక ఆరోగ్యానికి దారితీస్తుందన్నారు. వ్యక్తిత్వ మార్పు పెరుగుదల ద్వారా మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు స్మార్ట్‌ఫోన్‌లు కార్యాలయంలో, కుటుంబ సంబంధాల్లో ప్రజలపై నిశ్శబ్దంగా ఒత్తిడిని పెంచుతున్నాయన్నారు. వారానికి ఒక రోజు మొబైల్ ఫోన్‌ల వాడకాన్ని ఆపడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ అధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశంలో 25-30శాతం మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని అన్నారు. ఈ వ్యాధి 15-25 సంవత్సరాల వయస్సు గల వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. దీని కారణంగా ఆత్మహత్య కేసులు పెరుగుతున్నాయి దీనిని నివారించడానికి 14416అనే టెలి-హెల్ప్‌లైన్‌ను ప్రారంభించామని ఆయన అన్నారు. ఈసందర్భంగా సుమంగళమ్మ కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్, జిల్లా కుటుంబ సంక్షేమ కార్యక్రమ అమలు అధికారి డాక్టర్ పూర్ణిమ, జిల్లా ఆరోగ్య విద్య అధికారిణి ఖుర్షీద్‌బేగం, సయ్యదా తన్వీర్, పాతిమా, పాఠశాల బోధన,బోధనేతర సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.